ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 14 సెప్టెంబరు 2024



పట్టణంలో ఊరేగుతున్న గణపతి

విగ్రహాల నిమజ్జనం



గణపయ్యా.. వెళ్లిరావయ్యా..

- ప్రారంభమైన నిమజ్జనం
- 'పురం'లో కోలాహలంగా శోభాయాత్ర
- ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

హిందూపురం, సెప్టెంబరు 13 : వారం రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథులు గంగమ్మ ఒడికి చేరారు. హిందూపురం పట్టణంలో వివిధ వీధుల్లో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యలకు వినాయక చవితి పురస్కరించుకుని గత శనివారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు పూజలు నిర్వహించారు. సాయంత్రం 4గంటల తరువాత పట్టణంలోని విగ్రహాలను నిమజ్జనాలకు తరలించేందుకు కదిలించారు. 150కి పైగా విగ్రహాలను ట్రాక్టర్లలో నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. డీజే సౌండ్‌తో హిందూపురం మార్మోగింది. యువత నృత్యాలు, కేరింతలతో సందడి చేశారు. పోలీసులు ఎంత కఠినంగా వ్యవహరించినా విగ్రహాల తరలింపు ఆలస్యంగానే ప్రారంభమైంది. పట్టణంలోని అతిపెద్ద విగ్రహాలైన గరిడి, కట్టకింద వినాయకులు సాయంత్రం 5గంటలకు మండపాల నుంచి వాహనాల్లోకి చేర్చారు. ఈ సందర్భంగా పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ పంపిణీ, నీరు పంపిణీ చేపట్టారు.

ఆ మూడుచోట్ల ప్రత్యేక నిఘా

హిందూపురం పట్టణంలోని హస్నాబాద్, రహమత్‌పురం, ఆర్టీసీ కాలనీల్లో విగ్రహాలు తరలింపు సందర్భంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఎస్పీ రత్న ప్రత్యేకంగా పర్యవేక్షించారు. గతంలో జరిగిన సంఘటనలు దృష్టిలో ఉంచుకుని పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్పీతో పాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 30 మంది సీఐలు, 1200 మంది దాకా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.



గుడ్డం కోనేరువద్ద పర్యవేక్షిస్తున్న డీఐజీ షిమోషి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : డీఐజీ

హిందూపురం, సెప్టెంబరు 13 : వినాయక నిమజ్జనం సందర్భంగా ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి హెచ్చరించారు. శుక్రవారం హిందూపురంలో నిమజ్జనం శోభయాత్రను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ విలేకరులతో మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా, నిమజ్జనానికి అడ్డంకులు కలిగించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. శనివారం తెల్లవారులోపు విగ్రహాలు నిమజ్జనం జరిగేలా చూడాలని ఎస్పీని ఆదేశించారు.





హస్నాబాద్‌లో పర్యవేక్షిస్తున్న ఎస్పీ రత్న

చేనేత సంఘాలకు ఊపిరి

మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు



వైసీపీ పాలనలో చేనేత పరిశ్రమ నిర్వీర్యం

- కొత్త ప్రభుత్వంతో పరిశ్రమకు జీవం
- త్వరలో చేనేత సొసైటీలకు ఎన్నికలు
- కార్మికుల్లో చిగురిస్తున్న ఆశలు

చేనేత పరిశ్రమకు మళ్లీ మంచి రోజులు వస్తున్నాయి. గత వైసీపీ పాలకుల విధానాలతో చితికిపోయిన పరిశ్రమకు ఎన్డీయే కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో జీవం వస్తుందని కార్మికులు ఆశిస్తున్నారు. గత ఐదేళ్లలో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు కూడా నిర్వహించలేదు. కొందరు వైసీపీకి చెందిన మాస్టర్‌వీవర్స్ ఇష్టానుసారంగా రాయితీలు స్వాహా చేసుకుని కార్మికుల పొట్టలుగొట్టారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయడంతో కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ధర్మవరం, సెప్టెంబరు 13: చేనేత పరిశ్రమ గత పాలకుల హయాంలో పూర్తిగా నిర్వీర్యమై పోయింది. శ్రీసత్యసాయి జిల్లాలో 73 చేనేత సహకారం సంఘాలు ఉండగా వైసీపీ ప్రభుత్వం రాగానే 13 సంఘాలు మాత్రమే మిగిలాయి. మిగిలిన 60 సంఘాలు పనిచేయలేదు. కానీ ఆ పేరుతో వచ్చే రాయితీలను కొందరు వైసీపీ నాయకులు దిగమింగుతున్నారని ఆ వర్గాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత సహకార సంఘాలకు ఊపిరిపోసేందుకు చర్యలు ప్రారంభించింది. మూడు నెలల్లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఈ నెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలై డిసెంబరు 6న పాలక వర్గాలు కొలువు తీరేలా చర్యలు తీసుకుంటోంది. గతంలో 100 మంది సభ్యులతో సంఘాల రిజిస్ట్రేషన్ చేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం 30 మందితో కూడా రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాలో కూడా పలువురు నూతన సంఘాల ఏర్పాటుకు ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందులోనూ ధర్మవరం నుంచి సంఘాల ఏర్పాటుకు ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఎన్నికలు పూర్తయి సంఘాలు తిరిగి పురుడుపోసుకుంటే నేతన్నలకు పూర్తి స్థాయిలో పనులు దొరుకుతాయి. ప్రభుత్వం నుంచి కూడా కొంత మేర రాయితీ నిధులు విడుదలవుతాయని నేతన్నలు ఆశిస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా ఎన్నికలు నిర్వహించ లేదు. చేనేత సంఘాల్లో నిధులు లేక ఉత్పత్తులు నిలిచిపోయి కార్మికులకు పనిలేకుండా పోవడంతో ఆర్థికలేమితో అలమటించే పరిస్థితులు దాపురించాయి. ప్రస్తుతం ఆయా సంఘాల కింద రికార్డుల్లో తప్పా వాస్తవంగా మగ్గాలు కనిపించలేదు. నేతన్నలు మరో వృత్తిలోకి వెళ్లలేక ఆ సంఘాల్లోని కార్మికులంతా మాస్టర్ వీవర్స్ వద్ద వారిచ్చే కాస్తో కూస్తో కూలితోనే కూలి మగ్గం నేసుకునే పరిస్థితి ఏర్పడింది. చాలామంది వైసీపీకి చెందిన వారే సంఘాల పాలకవర్గాలుగా వ్యవహరిస్తున్నారు.

ఎన్నికలు నిర్వహించడం అభినందనీయం

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం అభినందనీయం. గత ఐదేళ్లు చేనేత సంఘాలకు ఎన్నికలు జరగక నిర్వీర్యమయ్యాయి. దీంతో చేనేత కార్మికులకు ఎలాంటి ఉపయోగం లేకుండాపోయింది. సంఘాలు మళ్లీ పూర్వవైభవంలోకి వస్తే చేనేత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- జింకాచలపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ చేనేత కార్మికసంఘం

పనిచేయని వాటిని తప్పించాలి

చేనేత సహకార సంఘాలు చాలా వరకు పనిచేయడంలేదు. గత టీడీపీ హయాంలో చేనేత సంఘాలు బాగా నడిచేవి. పనిచేయని సంంఘాలను తప్పించి మిగిలినవాటికి ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధికి కృషిచేస్తే జగన్ నిర్వీర్యం చేశారు. మళ్లీ వాటికి ఊపిరి పోయడానికి టీడీపీ ప్రభుత్వం నడుం బిగించడం హర్షణీయం.

- వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి, చేనేత కార్మిక సంఘం

మినీ గోకులాలకు దరఖాస్తుల వెల్లువ

పుట్టపర్తి, సెప్టెంబరు 13: శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయం తర్వాత రెండో స్థానం పాడిపరిశ్రమదే. ఇటీవల వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో రైతులు పాడిపరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పాడిపరిశ్రమను ఆదుకునే దిశగా అడుగులు వేసింది. ఇందులో భాగంగా మినీ గోకులాల పేరుతో పాడిరైతులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఉపాధి హామీ పథకం ద్వారా పాడి పరిశ్రమను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. పాడి గేదేలు, ఆవులను పోషిస్తున్న రైతుల నుంచి మినీగోకులాల నిర్మాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయి. జిల్లాలో మినీగోకులాలకు 1325 యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. వీటిని జిల్లాలోని 32 మండలాలకు 30 నుంచి 40 వరకు యూనిట్లను కేటాయించింది. ఇందులో జనరల్ కేటగిరి 649, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 676 యూనిట్లను కేటాయించారు.



నిర్మాణాలు ఇలా..

మినీ గోకులాలకు సంబంధించి రెండు పశువులకు యూనిట్ విలువ రూ.1.15 లక్షలు ఉండగా ఉపాధి హామీ పథకం నిధులు రూ. 1,03,500 రైతులవాటా రూ.11500 ఉంటుంది. నాలుగు పశువుల గోకులం యూనిట్ విలువ రూ. 1.85లక్షలు ఉండగా.. ఉపాధి నిధులు రూ. 1,66,500, రైతువాటా రూ. 18,500, ఆరు పశువులకు రూ. 2.30 లక్షలు ఉండగా ఉపాధి నిధులు రూ.2.07 లక్షలు, రైతు వాటా రూ.23 వేలుగా నిర్ణయించారు. దీంతో పాటు గొర్రెలు, మేకలు కోళ్ల షెడ్లు నిర్మించుకోవడానికి మినీ గోకులాల కింద నిధులు మంజూరు చేస్తారు.



అర్హులు వీరే..

ఎస్సీ, ఎస్టీ, వలస డీనోటిఫైడ్ తెగలవారు, దారిద్ర్యరేఖ దిగువున్నవారు, మహిళా యజమాని, అంగవైకల్య యజమాని కుటుంబాలు, భూసంస్కరణ ఈఎంపైజీ లబ్ధిదారులు, అటవీ హక్కుల చట్టం 2006 లబ్ధిదారులు, చిన్నసన్నకారు రైతులు.

వేలల్లో దరఖాస్తులు

మినీ గోకులాలకు ఆయా మండల కేంద్రాల్లోని పశువైద్య కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో రెండు వేల దరఖాస్తులు అందినట్లు తెలుస్తోంది. కేటగిరి వారిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.




5వేల యూనిట్లకు ప్రతిపాదనలు

జిల్లాలో ఎక్కువ మంది పాడిపరిశ్రమపై ఆదారపడి జీవిస్తున్నారు. ప్రస్తుతం మంజూరైన యూనిట్లకంటే అదనంగా మరో 5వేల యూనిట్లు మంజూరుచేయాలని జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

- శుభదాసు, జేడీ, పశుసంవర్ధకశాఖ

పొలాల్లో కొండచిలువ



పొలంలో సంచరిస్తున్న కొండచిలువ

కొండచిలువ నేరుగా పొలాల్లోకి రావడం తో రైతులు ఆందోళన చెందారు. ఓబుళదేవరచెరువు మండలం బలిజపల్లి పరిసర ప్రాంతాల్లోని హరీష్ అనే రైతు పొలాల్లో వ్యవసాయ పనులు చేస్తుండగా 12 అడుగుల కొండచిలువ కనిపించింది. దానిని రైతులు పట్టుకుని గ్రామంలోకి తీసుకెళ్లి బోనులో ఉంచారు. అనంతరం అటవీశాఖ అధికారి రామక్రిష్ణకు అప్పగించారు. అటవీశాఖ అధికారులు రైతుల సాయంతో కొండచిలువను సమీపంలోని కొండల్లోకి వదిలిపెట్టారు.

- ఓబుళదేవరచెరువు

స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తన కూతురుకు వైద్యం చేయించాలని అగళికి చెందిన రైతు నరసింహమూర్తి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు సోమవారం విన్నవించారు. తన కూతురు నాగమల్లేశ్వరి(14) మానసికంగా ఎదగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సమస్యను పరిష్కరించాలని డీఎంహెచ్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అగళి ఎస్సీ కాలనీకి వెళ్లి నరసింహమూర్తి కూతురు నాగమల్లేశ్వరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బాలిక పరిస్థితిపై డీఎంహెచ్‌ఓకు నివేదిక పంపుతామని తెలిపారు. బాలికకు గతంలో బెంగళూరులో వైద్య పరీక్షలు చేయించామని, వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చవుతుందని తెలిపారని కుటుంబ సభ్యులు అన్నారు.

- అగళి

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

- బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం



రొద్దం మండలం కందుకూర్లపల్లిలో భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్/పరిగి, సెప్టెంబరు 13: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం రొద్దం మండలం కందుకూర్లపల్లిలో రూ.1.25 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామస్వరూపాలను మార్చడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అధికారం వచ్చిన మూడు నెలల్లోనే అమరావతితోపాటు పోలవరం పనులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద రొద్దం మండలంలో రూ. 5.44కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ కింద పారిశుధ్యం మెరుగు కోసం మండలానికి మూడు ట్రాక్టర్లు కేటాయించారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నియోజకవర్గంలో రూ.23.31 కోట్లతో 41.51 కిలో మీటర్ల నూతన రోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. పెనుకొండ మండలంలో రూ.4.15 కోట్లతో 5.68 కి.మీ. రోడ్డు, పరిగిలో రూ.4 కోట్లతో 9 కి.మీ., సోమందేపల్లిలో రూ.4.37 కోట్లతో 8.45 కి.మీ., గోరంట్లలో రూ.5.44 కోట్లతో 10.67 కి.మీ., రొద్దంలో రూ.5.35 కోట్లతో 7.72 కిలో మీటర్ల రోడ్డును వేయనున్నట్లు తెలిపారు. పరిగి మండలంలోని సేవామందిరం ఉన్నత పాఠశాలలో ప్రహరీ నిర్మాణానికి మంత్రి భూమిపూజ నిర్వహించారు. అనంతరం మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో ఓనం



సంగీత కచేరి నిర్వహిస్తున్న హరిరాగ్‌నందన్

పుట్టపర్తి, సెప్టెంబరు 13 : కేరళ భక్తుల ఓనం వేడుకలు శుక్రవారం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. వేద పఠనంతో ఓనం వేడుకలు ప్రారంభమయ్యాయి. సంగీత కళాశాల పూర్వ విద్యార్థి హరరాగ్‌నందన్ బృందం సంగీత కచేరి నిర్వహించారు. గంటపాటు మధురగానం వాయిద్యంతో భక్తులను అలరించారు. గాయకులను సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ పట్టుశాలువాలతో సన్మానించారు. మరో రెండురోజుల పాటు ఓనం వేడుకలు కొనసాగనున్నాయి.



గాయకుడిని సన్మానిస్తున్న ఆర్జే రత్నాకర్

పరుగుల వరద

525 పరుగులతో పటిష్ట స్థితిలో ఇండియా-సి జట్టు



అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13: దులీప్‌ట్రోఫీలో పరుగుల వరద పారుతోంది. అనంతపురంలోని అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో రెండో రౌండ్ దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీలు శుక్రవారం కొనసాగాయి. ఓవర్‌నైట్ స్కోర్ 288/8తో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా ఏ జట్టు మరో రెండు పరుగులు మాత్రమే జోడించి ఆలౌట్ అయ్యింది. క్రీజులో ఉన్న షాంశ్ ములానీ 89పరుగులకు, అకీబ్‌ఖాన్ పరుగులేమీ చేయకుండానే పెవిలియన్ దారి పట్టారు. ఖలీల్‌అహ్మద్ 16 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన ఇండియా డి జట్టు 183పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో ఇండియా ఏ జట్టుకు 107 పరుగుల ఆధిక్యం లభించింది. ఇండియా డి జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ డకౌట్ అయ్యాడు. జట్టులో దేవదత్ పడిక్కల్ మాత్రమే 92 పరుగులతో రాణించాడు. మిగతా బ్యాటర్లు ఆశించినమేరకు రాణించకపోవడంతో ఇండియా డి జట్టు 183 పరుగులకే ఆలౌట్ అయ్యింది. ఇండియా-ఏ బౌలర్లు ఖలీల్ అహ్మద్, అకీబ్ ఖాన్ చెరో 3వికెట్లు పడగొట్టారు. ప్రసిద్ధ్‌కృష్ణ, తనుష్‌కొటియాన్, షాంశ్ ములానీ తలో వికెట్ పడగొట్టారు. రెండో రోజు ఆటముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా ఏ 28.1ఓవర్లలో వికెట్ నష్టానికి 115 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ 56 పరుగులకు ఔట్ కాగా, ప్రథమ్‌సింగ్ 59పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మొత్తంగా ఇండియా ఏ జట్టు 222పరుగుల ఆధిక్యంలో ఉంది.

పటిష్ట స్థితిలో ఇండియా-సి

దులీప్‌ట్రోఫీలో ఇండియా సి జట్టు 525 పరుగులతో పటిష్టస్థితిలో నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇండియా సి జట్టు ఓవర్‌నైట్ స్కోర్ 357/5తో రెండో రోజు ఆటను ప్రారంభించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 58, పరుగులు సాధించగా, మానవ్‌సుతార్ 156 బంతుల్లో 11బౌండరీలు, 3 సిక్సర్లతో 82 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అన్షుల్ కాంబోజ్ చివరిలో 38 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మొత్తంగా మొదటి ఇన్నింగ్స్‌లో 525 పరుగులకు ఇండియా సి జట్టు ఆలౌట్ అయ్యింది. ఇండియా బి బౌలర్లు ముకేష్‌కుమార్, రాహుల్ చాహర్ చెరో 4 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇండియా బి జట్టు వికెట్ నష్టపోకుండా 36ఓవర్లలో 124పరుగులు చేసింది. కెప్టెన్ అభిమన్యు ఈశ్వర్ 51, జగదీశన్ 67 పరుగులతో క్రీజులో ఉన్నారు.

క్రికెట్ అభిమానులకు పండగ

దులీప్‌ట్రోఫీలో బ్యాటర్లు తొలి రోజు నుంచే పరుగుల వరద పారిస్తూ క్రికెట్ అభిమానులను అలరిస్తున్నారు. రెండు మ్యాచ్‌లు జరుగుతుండగా నాలుగు జట్లలోనూ బ్యాటర్లు రాణిస్తున్నారు. ఇండియా-సి జట్టు 525 పరుగులు చేసింది. ఇండియా-బి జట్టు 124 పరుగులతో దీటుగా ఎదుర్కొంటోంది. ఇక ఇండియా-ఏ జట్టు 290పరుగులు చేయగా, ఇండియా డి జట్టు 183 పరుగులు చేసింది. ఆయా జట్లలో బ్యాటర్లు బ్యాట్‌తో ఝుళిపిస్తున్నారు. సిక్స్‌లు, బౌండరీలతో క్రికెట్ అభిమానులను అలరిస్తున్నారు. గ్యాలరీల్లో ప్రేక్షకులు నృత్యాలు చేస్తూ...కేరింతలు కొడుతున్నారు. డ్రమ్స్, ఈలలతో ప్లేయర్లను ప్రోత్సహిస్తున్నారు.




మయాంక్ అగర్వాల్



జగదీశన్



ఈశ్వరన్



దేవదత్ పడిక్కల్







మ్యాచ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు, క్రికెట్ అభిమానులు

రైతుకు మేలు జరగాలి

పంట నష్టపరిహారం, బీమా అందాలి

ఎమ్మెల్యే పరిటాల సునీత



వ్యవసాయశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ పంట నష్టపరిహారం, బీమా అందే విధంగా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ అధికారులు జిల్లాలో పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఈ ఖరీఫ్‌లో వర్షాభావంతో వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇలాంటి సమయం లో ప్రతి రైతుకూ ఈ-పంట నమోదు ముఖ్యమైనదన్నారు. పార్టీలకతీతంగా రైతులు సాగు చేసి ప్రతి పంటకు ఈ-పంట నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం 80 శాతం సబ్సిడీతో అందజేస్తున్న ప్రత్యామ్నాయ విత్తనాలు రైతులు ఉపయోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయశాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులను కోరారు.

ఆర్పీఎఫ్ డీఎస్‌సీ కార్యాలయం ప్రారంభం

గుంతకల్లు, సెప్టెంబరు 13: స్థానిక డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో నిర్మించిన రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ కార్యాలయాన్ని డీఆర్ఎం విజయకుమార్ ప్రారంభించారు. డీఆర్ఎం కార్యాలయంలోని ఓ పాత భవనంలో ఆర్పీఎఫ్ డీఎస్‌సీ ఆఫీసు ఉండేది. రైల్వే డీఆర్ఎం కార్యాలయ పాత క్యాంటీన్ ప్రదేశంలో నూతనంగా ఆర్పీఎఫ్ డీఎస్సీ కార్యాలయాన్ని నిర్మించి, పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం డీఆర్ఎం ఆధ్వర్యంలో రిబ్బన్ కత్తిరించి ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, డీఎస్సీ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



డీఎస్‌సీ కార్యాలయాన్ని ప్రారంభించిన డీఆర్ఎం విజయకుమార్

డీపీఓ గుమస్తాల బదిలీ

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 13: జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న గుమస్తాలను డీపీఓ ప్రభాకర్‌రావు బదిలీ చేశారు. అందులో భాగంగా సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌ను ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయానికి, మరో సీనియర్ అసిస్టెంట్ స్వరూప్‌ను పెనుకొండ డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. వారి స్థానాల్లో పెనుకొండ నుంచి సీనియర్ అసిస్టెంట్ ఉషారాణిని, ధర్మవరం డీఎల్‌పీఓ కార్యాలయం నుంచి లీలాబాయిని అనంతపురం డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామిని పుట్టపర్తి డీపీఓ కార్యాలయానికి, పుట్టపర్తి నుంచి జూనియర్ అసిస్టెంట్లు సాయి, నితీష్‌ను డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. పెనుకొండ నుంచి జూనియర్ అసిస్టెంట్ నిరంజన్‌ను పుట్టపర్తి డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

పిల్లోళ్లకు సెలవుల పండగ

అనంతపురం విద్య, సెప్టెంబరు 13: జిల్లా వ్యాప్తంగా స్కూళ్లకు మూడు రోజుల పాటు సెలవులు వచ్చాయి. రెండో శనివారం, ఆదివారంతోపాటు మిలాడ్ ఉన్ నబి పర్వదినం సందర్భంగా సోమవారం కూడా సెలవు కావడంతో వరుస సెలవులు రానున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాల నేపథ్యంలో ఈ నెల 2వ తేదీ స్కూళ్లకు సెలవు ప్రకటించారు. దీంతో ఆ సెలవును కవర్ చేయడానికి రెండో శనివారం (నేడు) వర్కింగ్ డే కింద స్కూళ్లు నిర్వహించాలని కొందరు కరస్పాండెంట్లు భావించారు. ఇతర జిల్లాల్లో ఇప్పటికే వర్కింగ్ డేగా ప్రకటించుకున్నారు. జిల్లాలో సెలవు ఇచ్చుకోవాలా..? స్కూళ్లు నడపాలా అన్న అంశంపై కరస్పాండెంట్లు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. సెలవుపై స్పష్టత ఇవ్వాల్సిన జిల్లా విద్యాశాఖాధికారులు సాయంత్రం వరకూ మౌనం వీడలేదు. సాయంత్రం దాటాక శనివారాన్ని సెలవుగా పరిగణించాలంటూ కరస్పాండెంట్లకు విద్యాశాఖ సమాచారం వెళ్లడంతో....సెలవుగా ప్రకటించుకున్నారు. దీంతో 14,15,16 మూడు రోజులూ వరుసగా సెలవులు రానున్నాయి.

డిగ్రీ గణిత శాస్త్రంలో ఆనర్స్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 13: డిగ్రీ గణితశాస్త్రంలో 4వ సంవత్సరం ఆనర్స్ అడ్మిషన్లు చేపట్టినట్లు ఆర్ట్స్ కళాశాల గణితశాస్త్ర విభాగాధిపతి నాగశశికళ శుక్రవారం తెలిపారు. 2023-24లో బీఎస్సీ తృతీయ సంవత్సరం అభ్యసించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుందన్నారు. ఆనర్స్ పూర్తి చేసిన విద్యార్థులు ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశాలు పొందవచ్చు అన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010429089, 7702110277 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

వైసీపీతో పంచాయతీరాజ్ నిర్వీర్యం

సర్పంచుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్

తాడిమర్రి, సెప్టెంబరు 13: రాష్ట్రంలో పంచాయతీ రాజ్ వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సర్పంచుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన తాడిమర్రిలో విలేకరులతో మాట్లాడుతూ సర్పంచుల అధికారాలను వైసీపీ ప్రభుత్వం కాలరాసిందన్నారు. 14,15 ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించి గ్రామాలు అభివృద్ధికి నోచుకోకుండా చేసింది వైసీపీ ప్రభుత్వమే అన్నారు. ఆ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఉషశ్రీచరణ్ ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రాగానే పాత తప్పులను మరచిపోయి ఎదుటి వారిని విమర్శించడం దారుణమన్నారు. అప్పట్లో సర్పంచులకు ఏ అధికారం లేకుండా చేసి ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం సర్పంచులను పనిచేయనీడంలేదని అనడం సబబు కాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలలలోపే రూ.800 కోట్లు సర్పంచుల ఖాతాలకు బదిలీ చేయడం నిజం కాదా అని ప్రశ్నించారు.

సంచార జాతుల సంక్షేమానికి కృషి

గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 13: సంచార జాతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని గుంతకల్లప్ప కల్యాణ మండపంలో శుక్రవారం సంచార జాతుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంచార జాతుల వారు గ్రామీణ కళలు, ఇతిహాసాలు, రామాయణం, మహాభారతం, బుర్రకథలు, తోలుబొమ్మల ఆటల ద్వారా సంస్కృతిని కాపాడుతూ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సంచార జాతుల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడుతానని చెప్పారు. వెంటకశివుడు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంచార జాతులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించారన్నారు. పాదయాత్రలో నారా లోకేష్ సంచారజాతుల కష్టాలు చూశాడని తెలిపారు. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంచారజాతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవి, వై.శ్రీనివాసులు మాట్లాడుతూ తమకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కళాకారులకు పింఛన్లు, పక్కాగృహాలు, నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంచారజాతుల సంఘం జాతీయ కన్వీనర్ డి.శ్రీనివాసులు, ఎమ్మెల్యే సోదరులు నారాయణ స్వామి, శ్రీనివాసులు, టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు, సంచార జాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. కుళ్లాయప్ప, వివిధ సంఘాల నాయకులు ఇందిరాదేవి, జోగివెంకటేష్, ఎంకే రామాంజినేయులు, బండారు రామన్నచౌదరి, శేఖర్ పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు, సంచారజాతుల సంఘం నాయకులు

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలి

ఇరిగేషన్ సీఈకి జలసాధన సమితి వినతి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13: ఉమ్మడి జిల్లాలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టలన్నీ పూర్తి చేయాలని జలసాధన సమితి నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ కార్యాలయంలో సీఈ నాగరాజును శుక్రవారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్ కుమార్, గంగిరెడ్డి మాట్లాడుతూ హంద్రీనీవా కాలవ వెడల్పు పనులు చేపట్టాలని, డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో 2.5లక్షల ఎకరాల ఆయ కట్టుకు సాగునీరు అందించాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ నిర్మాణం, వెడల్పు, సామర్థ్యం పెంచాలన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు చేపట్టాలని, పీఏబీఆర్‌ను 11టీఎంసీల పూర్తి నీటి సామర్థ్యానికి పెంచాలని కోరారు. పెన్నా, చిత్రావతి, వేదవతి నదులపై డ్యాంలు నిర్మించాలన్నారు. టీబీ డ్యాం, శ్రీశైలం డ్యాంలలో వరద ఉన్నందున తుంగభద్ర, కృష్ణా జలాలను జిల్లాకు అధికంగా తీసుకుని రిజర్వాయర్లు, చెరువులన్నింటినీ నీటితో నింపాలన్నారు. దీనికి సీఈ స్పందిస్తూ...పెండింగ్ పనులు పూర్తి చేస్తామని, రిజర్వాయర్లు, చెరువులను నీటితో నింపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు ఏసు, వీరనారప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న జలసాధన సమితి సభ్యులు

రేపు అపుస్మా సమావేశం

అనంతపురం విద్య, సెప్టెంబరు 13: నగర శివారులోని మాంటిస్సోరి ఎలైట్‌లో ఈ నెల 15న అపుస్మా జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఆ సంఘం నాయకులు తెలిపారు. కమలానగర్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ ముఖ్య సలహాదారులు శేఖర్‌రావు, పరంజ్యోతి చేత ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్లకు మోటివేషన్ క్లాసులు ఈ నెల 15న నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షులు పుల్లారెడ్డి తెలిపారు. అదే రోజున జిల్లా సర్వసభ్య సమావేశం కూడా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాలకు అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసి ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షుడు నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ నాగరాజు, నాయకులు శశిభూషణ్, సూర్యనారాయణరెడ్డి, రవిశంకర్ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమావేశమైన నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం: మంత్రి సవిత

విజేతలకు బహుమతులు అందజేత



విజేతలతో మంత్రి సవిత

హిందూపురం, సెప్టెంబరు 13: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని మార్కెండేయనగర్‌లోని ఎస్పీఆర్ బ్యాడ్మింటన్ అకాడమీలో సబ్ జూనియర్ అండర్-15 విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి పోటీలు ప్రారంభమై శుక్రవారం ముగిసాయి. పోటీల్లో 13 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన వారికి మంత్రి బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ సహకారాలు క్రీడాకారులకు ఉంటాయన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు భవిష్యత్తులో ఉద్యోగాలు పొందడానికి దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నియోజకవర్గంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అనంతపురం బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ అంకమ్మ చౌదరి, సంయుక్త కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, డాక్టర్ వెంకటేశ్, పద్మావతి, అసోసియేషన్ సభ్యులు జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్వామా పీడీ బదిలీ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 13: డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి బదిలీ అయ్యారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ జీఓ నంబరు 519 జారీ చేశారు. డ్వామా పీడీగా ఉన్న వేణుగోపాల్ రెడ్డిని తన మాతృశాఖ అయిన జైళ్ల శాఖకు డీఎస్పీగా బదిలీ చేశారు. మంగళవారం ఆయన రిలీవ్ కానున్నారు. అయితే ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురం రూరల్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.15 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 25టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సీఎల్ఐసీ పరీక్షా ఫలితాలు విడుదల

కొత్తచెరువు, సెప్టెంబరు 13: సీఎల్ఐసీ-2024 పరీక్షా ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిందని విద్యాశాఖ ఏడీ-3 లాజర్ శుక్రవారం తెలిపారు. ఈ ఫలితాలను WWW.DSE.AP.GOV.IN వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చన్నారు. అదేవిధంగా డమ్మీ మార్కుల జాబితాను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రేపు డిపార్ట్‌మెంటల్ పరీక్ష

అనంతపురం అర్బన్: ఉమ్మడి జిల్లాలో గ్రామీణ పశు సంవర్థక సహాయకులుగా ఉద్యోగం పొందిన 449 మందికి ఈనెల 15న డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఉంటుందని ఆ శాఖ జేడీ వెంకటస్వామి శుక్రవారం తెలిపారు. వీరికి ప్రత్యేక శిక్షణ పూర్తయిందని, ఈనెల 15న ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పరీక్ష హాల్‌లోకి అభ్యర్థులను అనుమతిస్తామని తెలిపారు.

బీటెక్, ఎంటెక్, ఎంఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 13: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్, ఎంటెక్, ఎంఫార్మసీ పరీక్షల ఫలితాలను శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జూలైలో బీటెక్ తృతీయ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు మూడు, నాలుగో సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సెమిస్టర్(ఆర్17,21) సప్లిమెంటరీ. ఎంఫార్మసీ ప్రథమ, తృతీయ సెమిస్టర్(ఆర్17,21) సప్లిమెంటరీ. ద్వితీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, (ఆర్17) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ ఏపీ శివకుమార్, ఏసీలు శంకర్ శేఖర్, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు

సీతారాం ఏచూరి ఆశయాలు కొనసాగిద్దాం

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆశయాలని కొనసాగిద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదురుగా, మల్లు స్వరాజ్యం నగర్, శ్రీశ్రీ నగర్, నగరపాలక సంస్థ కార్మిక సంఘం, ఆటో కార్మిక సంఘం, రంగస్వామి నగర్ తదితర ప్రాంతాల్లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేంద్రకుమార్, నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, వలి, రాజు, వెంకటేష్, గఫూర్, టీయస్ రసూల్, కుమార్, హరి, రాఘవ, నాగేశ్వరరావు, ముసలప్ప, రాముడు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కార్మికులు

సత్యసాయి నీటి కార్మికుల హర్షం

కొత్తచెరువు, సెప్టెంబరు 13: పెండింగ్ వేతనాలను కూటమి ప్రభుత్వం విడుదల చేయడంతపై సత్యసాయి నీటి విభాగపు కార్మికు లు హర్షం వ్యక్తం చేశారు. సత్యసాయి పంప్ హౌస్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

కదిరి అర్బన్, సెప్టెంబరు 13 : కదిరి డివిజన్ పరిధిలోని కదిరి, తలుపుల, గాండ్లపెంట, ముదిగుబ్బ, ఎన్పీకుంట, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఈఈ మోసస్ తెలిపారు. కుటాగుళ్ల వద్ద ఉన్న సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు చెప్పారు.

విచ్చలవిడిగా కిక్

- ముదిగుబ్బలో అక్రమ మద్యం జోరు
- పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు





ముదిగుబ్బ ఎస్‌బీఐ బ్యాంకు పక్క వీధిలో బెల్టుషాపుల నిర్వహిస్తున్న ప్రాంతం

ముదిగుబ్బ, సెప్టెంబరు 13 : ముదిగుబ్బలో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలిశాయి. ముదిగుబ్బ - పులివెందుల ప్రధాన రహదారుల పక్కనే మద్యం బెల్ట్ షాపులు అధికంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. హోటళ్లు, చిన్న చిన్న కిరాణా బంకుల్లోనూ మద్యం వ్యాపారం కొనసాగుతోంది. తెల్లవారుజాము నుంచి మద్యం షాపు తెరిచేలోపు రూ. వేలల్లో ఈ వ్యాపారం జరుగుతోంది. మద్యం షాపులలో పాత పేర్లు గల బ్రాండ్లను బాటిల్‌పై పది రూపాయలు అదనంగా తీసుకొని బెల్టు షాపులకు పంపిణీ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలోని ఈ పేరు తెలియని బ్రాండ్లు తాగుతూ కొందరు అనారోగ్యాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. మరికొందరు ఏకంగా మృత్యువాత పడుతున్నారు. ఇలా కుటుంబాలు ఛిద్రమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వారి చిత్తశుద్ధిపై అనుమానాలకు తావిస్తోంది. ఎస్‌బీఐ బ్యాంకు పక్క వీధిలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో మందు బాబులు రోజూ వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో అటువైపు వెళ్లాలంటేనే మహిళలు, పిల్లలు భయపడుతున్నారు. మద్యం షాపులకు కొత్త స్టాకు వస్తే పాత పేర్లు కలిగిన బ్రాండ్లు ఒకటో, రెండో పంపిణీ చేసి మిగతా వాటిని బెల్టు షాపులకు విక్రస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బెల్టు షాపుల వద్ద బ్రాండ్ బాటిల్‌పై అదనంగా రూ. 50 వసూలు చేస్తున్నారు. ఇలా కేవలం ముదిగుబ్బలోనే కాకుండా... చుట్టుపక్కల గ్రామాల్లోనూ విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని బెల్టు షాపులను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

గాండ్లపెంట, సెప్టెంబరు 13: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బాలబాలికలకు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, కోకో, వాలీబాల్, యోగా, చెస్ తదితర క్రీడలు పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీల్లో రెక్కమాను, కటారుపల్లి, కేజీబీవీ, గాండ్లపెంట పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీలో గాండ్లపెంట, కోకోలో కటారుపల్లి, రెక్కమాను, వాలీబాల్ గాండ్లపెంట విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేత బాలబాలికలు నియోజకవర్గస్థాయి పోటీలకు వెళ్లతారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు.

ధర్మవరంరూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండలస్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 100మంది దాకా క్రీడాకారులు పాల్గొన్నారు. విజేత విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని క్రీడా నిర్వహకులు మండల కో-ఆర్డినేటర్ రఘునాథరావు తెలిపారు.

నల్లమాడ : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 14, 17 బాలబాలికలకు క్రీడాపోటీలు శుక్రవారం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

19 నుంచి కీడ్రా పోటీలు

కదిరి అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు స్కూల్ గ్రేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ వెంకటాచలం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఏచూరికి ఘన నివాళి



ధర్మవరంలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 13 : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద శుక్రవారం పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఇందులో సీపీఎం జిల్లా కమిటీ నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో-కన్వీనర్ ఎల్ ఆదినారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, చేనేత కార్మికసంఘం వెంకటస్వామి పాల్గొన్నారు.

పుట్టపర్తి : జిల్లా కేంద్రంలోని సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నాయకులు నివాళులు అర్పించారు. సీఐటీయూ నాయకులు పైపల్లి గంగాధర్, సుధాకర్, రమేష్, వెంకటేసు, బసప్ప, బాబయ్య అంజనేయులు ఇందులో పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరికి పలువురు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఇందులో జీఎల్ నరసింహులు, జగన్మోహన్, సాంబశివ, బాబ్‌జాన్, రామమోహన్, శాంతిబాయి, మాబూనీషా పాల్గొన్నారు.


నంబులపూలకుంట : స్థానిక బస్‌షెల్టర్ సమీపంలో ఏచూరి చిత్రపటం వద్ద సీపీఎం నాయకులు నరసింహులు, గంగిరెడ్డి, ఇరగంరెడ్డి, నాగరాజు నివాళులర్పించారు.

తనకల్లు : మండల కేంద్రంలో సీపీఎం, సీపీఐ నాయకులు ఏచూరి చిత్రపటం వద్ద నివాళ్లు అర్పించారు. ఇందులో సీపీఎం నాయకులు రమణ, వెంకటరమణ, శివన్న, సీపీఐ నాయకుడు రెడ్డెప్ప పాల్గొన్నారు.

కదిరి, (అమడగూరు) : స్థానిక ఆటో స్టాండ్ వద్ద సీతారాం ఏచూరి చిత్ర పటానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ కేశవ, బాషా, బావయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు తులసీ, కల్పన, కవిత, సరల, క్రిష్టమ్మ నివాళులర్పించారు.

క్రైం న్యూస్

హమాలీ ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 13: స్థానిక చెరువుమరవ ప్రాంతంలో నివాసముంటున్న హమాలీ అరిగే శ్రీనివాసులు (45) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య శివమ్మ టైలర్. వీరికి ఇరువురు కుమార్తెలు. రెండు రోజుల క్రితం శివమ్మ బెంగుళూరులో ఉంటున్న పెద్ద కుమార్తె వద్దకు వెళ్లింది. శుక్రవారం చిన్నకుమార్తె శ్రీవిద్య పాఠశాలకు వెళ్లింది. స్కూల్ నుంచి తిరిగి వచ్చిన శ్రీవిద్య... తన తండ్రి ఇంటిలో దూలానికి చీరతో ఉరేసుకొని ఉండటాన్ని గమనించి... చుట్టుపక్కల వారికి చెప్పింది. వారు వచ్చి గమనించగా.. అప్పటికే శ్రీనివాసులు మరణించినట్లు గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో చీరల వ్యాపారి మృతి



పవన్ (ఫైల్)

బత్తలపల్లి, సెప్టెంబరు 13 : మండలంలోని నల్లబోయనపల్లి వద్ద శుక్ర వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చీరల వ్యాపారి మరణించాడు. అనంతపురానికి చెందిన ఆంజనేయులు కుమారులు పవన్ (27), ఈశ్వర్. వీరు చీరల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఎప్పటిలాగే శుక్రవారం ద్విచక్ర వాహనంలో చీరలు వేసుకొని అనంతపురం నుంచి కదిరి వైపు బయలుదేరారు. నల్లబోయనపల్లి వద్ద ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పవన్ అక్కడికక్కడే మరణించాడు. ఈశ్వర్ గాయపడ్డాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది. పవన్‌కు భార్య స్వాతి, కుమార్తె ఉన్నారు.

ఇసుక వాహనాలు సీజ్

బత్తలపల్లి, సెప్టెంబరు 13 : మండలంలోని చిత్రవతి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. సీఐ ప్రభాకర్‌గౌడ్ తన సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. ఒక ఎక్స్‌కవేటర్, మూడు ట్రాక్టర్లు, నాలుగు టిప్పర్లను సీజ్ చేసి.. స్టేషన్‌కు తరలించారు. కేస్ నమోదు చేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

సీఎం సహాయనిధికి విరాళం



సీఎంకు చెక్కు అందజేస్తున్న నాయకులు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ఉమ్మడి అనంతపురం జిల్లా వడ్డెర సంఘం నాయకులు ముందుకు వచ్చారు. శుక్రవారం మంగళగిరిలో ముఖ్యమంత్రికి చంద్రబాబు నాయుడికి రూ. 2,00,016 చెక్కును అందచేశారు. సీఎం వారిని అభినందించారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే సిమెంట్ పోలన్న, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

తనకల్లు, సెప్టెంబరు 13: గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను ఈనెల 14 నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ ఇందులో భాగస్వామ్యులు కావాలని ఎంపీడీఓ వెంకటరమణ పేర్కొన్నారు. గ్రామాల్లో దండోరాలు వేయించి, సంబంధిత తేదీల్లో నిర్వహించే గ్రామ సభల్లో ప్రజలందరూ పాల్గొనేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

తనకల్లు, సెప్టెంబరు 13: మండలంలోని రతినేనాయక్ తండాకు చెందిన యమునాబాయి ల్యాబ్ టెక్నిషియన్‌గా చిత్తూరులో చదువుతోంది. తల్లిదండ్రులు హాస్టల్ ఫీజులు చెల్లించడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో చదువు ఆపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న యమునా తన సమస్యను గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్టరీ ఆఫ్ హోమ్ ఆఫైర్ బోర్డు సభ్యుడు డాక్టర్ ముక్తియార్ బాషా దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఆయన శుక్రవారం రూ.25 వేలను యమున బ్యాంక్ ఖాతాకు జమ చేశారు.

జూడో పోటీల్లో ప్రతిభ



గవ్వల సంధ్యా

ధర్మవరం, సెప్టెంబరు 13 : స్థానిక మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గవ్వల సంధ్యా జూడో పోటీల్లో ప్రతిభ చాటింది. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఈనెల 12న జరిగిన ఇండియా జూడో సౌత్ జోన్ సెలక్షన్స్ సబ్‌జూనియర్ కేటగిరి 28 కేజీల విభాగంలో వెండి పతకంతోపాటు రూ.3 వేలు నగదు బహుమతి సాధించింది. శుక్రవారం సంధ్యాను జూడో కోచ్ ఇనాయత్ బాషా, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ ప్రారంభం

కొత్తచెరువు : స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను ప్రభుత్వం ప్రారంభించినట్లు విద్యాశాఖ ఏడీ లాజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెంటర్‌లో 10వ తరగతి, ఇంటర్ ఆర్ట్స్ గ్రూపులకు విద్యాబోధన ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నారు.

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ



బియ్యం సేకరించిన టీడీపీ నాయకులు

నల్లమాడ సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల కోసం మండలంలోని మలసకవంకపల్లి టీడీపీ నాయకులు శుక్రవారం బియ్యం సేకరించారు. వీరు మసకవంకపల్లి, మూలప్పగారిపల్లి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి 60 ప్యాకెట్ల బియ్యం, రెండు ప్యాకెట్ల చింతపండు సేకరించారు. వాటిని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్‌కు అతని నివాసంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీపీ రామచంద్ర, బయ్యారెడ్డి, క్రిష్ణయ్య, నారాయణస్వామి, యల్లప్ప, జయప్ప, నాగభూషణ, వెంకటరమణ, రాము, చంద్రశేఖర్, క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ధర్మవరం : స్థానిక కొత్తపేటలోని సీతారామాంజనేయస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం కిమ్స్ సవేరా ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి అనూహ్యస్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో 168 మందికి వైద్యుడు హరీశ్ బీపీ, 2డి ఎకో, ఈసీజీ నిర్వహించారు. ఈ వైద్యశిబిరం రాయపాటి గంగాధర్ నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాయపాటి శివ, కుటుంబ సభ్యులు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు సురేశ్‌చౌదరి, టీడీపీ నాయకులు పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, బీజేపీ నాయకులు హరీశ్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో పంచాయతీ వార్డు మెంబరు మృతి



రమేశ్‌బాబు (ఫైల్)

కొత్తచెరువు, సెప్టెంబరు 13 : మేజర్ గ్రామపంచాయతీ 10వ వార్డు టీడీపీ మెంబరు సాలక్కగారి రమేశ్‌బాబు (53) అనారోగ్యంతో శుక్రవారం సాయంత్రం మరణించాడు. జ్వరం రావడంతో ఆయన్ను నాలుగు రోజుల క్రితం అనంతపురంలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం ఆయన్ను అంబులెన్స్‌లో బెంగుళూరు తరలిస్తుండగా మార్గమధ్యలో పరిస్థితి విషమించడంతో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మరణించాడు. పలువురు టీడీపీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయనకు భార్య లక్ష్మీ, కుమారుడు ఉన్నారు.

ఇళ్ల మధ్య మురుగు తొలగింపు



మురుగునీటిని తొలగిస్తున్న సిబ్బంది

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 13: మండలంలోని ఎం. కొత్తపల్లి గ్రామంలో ప్రధాన వీధిలో మురుగు నీరు.. వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై శుక్రవారం ఇళ్ల మధ్యే మురుగునీరు అనే పేరుతో ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన సర్పంచ్ టి. రంగారెడ్డి, కార్యదర్శి మధు కార్మికులతో కాలువను ఏర్పాటు చేసి, ఆ మురుగు నీరు వెళ్లేలా చేశారు. అనంతరం చుట్టు పక్కల ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించారు.

ఛ్చ.. స్టాంపు..!

- అందుబాటులోలేని నాన్ జుడీషియల్ స్టాంపులు
- ఈస్టాంపింగ్ కోసం వెళ్తే కొర్రీలు
- క్రయవిక్రయదారులకు తప్పని తిప్పలు



మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మడకశిరటౌన్, సెప్టెంబరు 13: నియోజకవర్గ వ్యాప్తంగా నాన్‌జుడీషియల్, ఈ స్టాంపుల కొరత వల్ల భూములు, ఆస్తుల క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.10 స్టాంపు కావాలన్నా 50 నుంచి 100 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు, నాలుగు నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా అటు అధికారులు, ఈస్టాంపింగ్ అప్పగించిన ప్రైవేటు సంస్థ స్టాక్‌హోల్డింగ్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఈస్టాంపింగ్ అడిగితే సంబంధిత ఏజెన్సీ అర్థంలేని నిబంధనలతో చుక్కలు చూపుతోందని స్టాంప్‌వెండర్లు వాపోతున్నారు. మడకశిర పట్టణంలో పదిమందికిపైగా లైసెన్స్‌డ్ హోల్డర్లు ఉన్నా.. ఒకరికి మాత్రమే స్టాక్ హోల్డింగ్ సంస్థ ఈస్టాంపింగ్‌ను అప్పగించింది. అప్పటి నుంచి ఇబ్బందులు తలెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాన్ జుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈస్టాంపింగ్ విధానాన్ని అమలు చేశారు. ఈస్టాంపింగ్ విధానంపై స్థిరాస్తుల క్రయవిక్రయదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినా వైసీపీ ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లింది. మడకశిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రోజూ 35 రిజిస్ట్రేషన్ల వరకు జరుగుతుంటాయి. స్టాంపులు లేకపోవడంతో హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నోటరీల కోసం రూ.10, రూ.20 స్టాంపులు లేకపోవడంతో విద్యార్థులు ఇతరత్రా అవసరాల కోసం వచ్చేవారు పడే ఇబ్బందులు అన్నీ, ఇన్నీకావు. స్టాంపు వెండర్ లైసెన్స్ ఉన్నా గత జగన్ ప్రభుత్వంలో స్టాక్‌హోల్డింగ్ సంస్థకు ఈస్టాంపింగ్ ఇచ్చే అధికారం ఇవ్వడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజముద్ర కావాలనీ, రకరకాల డాక్యుమెంట్లు సమర్పించాలనీ, లేనిపోని ఆంక్షలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో వారి వివరాలు ఉంటాయనీ, అయినా ప్రైవేటు సంస్థకు అప్పగించడం వల్ల వారు సొంత ఆంక్షలు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో తమ పేర్లు ఉన్నాయనీ, తమ లైసెన్స్ ఒరిజినలేనని కర్నూలుకు వెళ్లి స్టాంప్ హోల్డింగ్ సంస్థ వద్ద ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా వారు మాత్రం కనికరించకపోవడంతో మడకశిరలో ఈస్టాంపింగ్ ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజూ క్రయవిక్రయదారులతో పాటు డాక్యుమెంట్ రైటర్లు సైతం ఇతర ప్రాంతాల నుంచి స్టాంపులు తెప్పించుకుని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి సమస్యను పరిష్కంచాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

కదిరి ఆర్టీఓగా శ్రీనివాసులు



కదిరి అర్బన్, సెప్టెంబరు 13: కదిరి ప్రాంతీయ రవాణాధికారిగా (ఆర్టీఓ) జె. శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను ఎంవీఐ వరప్రసాద్, సిబ్బంది అభినందించారు. ఆయన అనంతపురం డీపీసీ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై కదిరి ఆర్టీఓగా బాధ్యతలు చేపట్టారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

నంబులపూలకుంట, సెప్టెంబరు 13 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రేపు రౌండ్ టేబుల్ సమావేశం

కదిరి అర్బన్, సెప్టెంబరు 13 : బీసీల కులగణన చేయాలని ఆదివారం పుట్టపర్తిలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ జిల్లా కార్యదర్శి రామచంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొని ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందాలి

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, సెప్టెంబరు 13: అత్యంత వెనుకబడిన మడకశిర ప్రాంతంలో ప్రజలు వైద్యం కోసం డబ్బు ఖర్చు పెట్టే పరిస్థితి లేదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. అలాంటి వారికి మెరుగైన వైద్యసేవలు అందించి ఆదర్శంగా నిలవాలని వైద్యులకు సూచించారు. మడకశిర వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. వైద్యులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ కృష్ణమూర్తి, అశ్వర్థరామప్ప, మంజునాథ్, మహాలక్ష్మీ, మారుతీరెడ్డిని ఎన్నుకున్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మడకశిర(అమరాపురం): అమరాపురం బస్టాండు ఆవరణలో ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్‌ప్లాంట్‌ను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మహాగణపతి విశేష పూజల్లో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో తాగునీటి పథకాన్ని ప్రారంభించారు.

డిగ్రీ కళాశాల స్థల పరిశీలన

గుడిబండ: మండలకేంద్రంలోని డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని కడప ఆర్‌జెడి రామలింగారెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు డిగ్రీ చదవాలంటే మడకశిర, హిందూపురం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, గుండుమలకు సీఎం నారాచంద్రబాబునాయుడు వచ్చిన సందర్భంలో సమస్యను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి తెలియజేయడం జరిగిందన్నారు. డిగ్రీ కళాశాల నిర్మాణానికి సీఎం హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ హామీ మేరకు స్థలాన్ని పరిశీలించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ నాగరాజు, హేమలత, డీటీ రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మడకశిరటౌన్: నగర పంచాయతీ పరిధిలోని గౌడనహళ్లి రహదారిలో ఉన్న యాదవ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు మహిళలు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు.

23 నుంచి డొమెస్టిక్ డాటా ఎంట్రీలో శిక్షణ

పెనుకొండ, సెప్టెంబరు 13: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్‌హబ్‌లో ఈనెల 23నుంచి డొమెస్టిక్ డాటా ఎంట్రీ కోర్సులో శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందడానికి టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలోని స్కిల్‌హబ్‌లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కోఆర్డినేటర్ శివప్రసాద్ 9676706976ను సంప్రదించాలన్నారు.

గోనిపేటలో సెల్‌టవర్ ఏర్పాటు చేయండి

హిందూపురం, సెప్టెంబరు 13: పెనుకొండ మండలం గోనిపేటలో సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక సభ్యులు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీటీ గిరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వేదిక సభ్యులు హరి మాట్లాడుతూ గోనిపేట గ్రామంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు పర్యటించి సమస్యను తెలుసుకున్నారని, పట్టణానికి 8 కి.మీ దూరంలో ఉన్న గోనిపేటలో దాదాపు 2వేల మంది జనాభా ఉన్నారన్నారు. ఇక్కడ వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ప్రధానంగా జీవిస్తున్నారన్నారు. వీరుప్రతిరోజూ చదువుకోవడానికి ఇతర పనులకు పెనుకొండకు వస్తుంటారని, కానీ సెల్‌ఫోన్‌లో మాట్లాడటానికి సిగ్నల్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. కావున ప్రజల సౌకర్యార్థం గ్రామంలో సెల్‌టవర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఆటో వెంకటేశులు, అశ్వర్థ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి సీపీఎం ఘననివాళి



నివాళులర్పిస్తున్న కార్మిక నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 13: మండలంలోని పాలసముద్రం జాతీయ రహదారికూడలిలోని పేదల నివాసాల వద్ద సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి వివిధ కార్మిక సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు కొండా వెంకటేష్, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరనిలోటని స్థానిక నాయకులు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం బాబావలి అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాపం సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం వామపక్షాలకు, జాతీయ రాజకీయాలకు తీరనిలోటన్నారు. ఆయన విద్యార్థి దశ నుంచే వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై సీపీఎంలో అంచెలంచెలుగా వెలుగుతూ 2015నుంచి జాతీయ కార్యదర్శిగా పనిచేస్తుండేవాడన్నారు ప్రజాపోరాటాలను ముందుండి నడిపేవారని, ఇండియా కూటమి ఏర్పాటు చేయడానికి కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు హరి, రమేష్, బాబావలి, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(సోమందేపల్లి): వామపక్షాల జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి మృతి సందర్భంగా స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో మండల కమిటీ నాయకులు ఘననివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికిపూలమాలలువేసి సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై సీపీఎం పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి 2015లో పార్టీ జాతీయ కార్యదర్శిగా నియమించబడ్డాడని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు రాజగోపాల్, రంగప్ప, చాంద్‌బాష, లక్ష్మీనారాయణ, మాబు, గంగరాజు, శ్రీకాంత్, మగ్గం రామాంజి, ఈడిగ నాగరాజు, చీల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ పోటీల్లో విజేతలు వీరే

గోరంట్ల, సెప్టెంబరు 13: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ద్వారా గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండలస్థాయి బాలుర పోటీల్లో విజేతను హెచ్‌ఎం గోపాల్ ప్రకటించారు. అండర్ 17లో వాలీబాల్, షటిల్ బ్యాట్మింటన్‌లో గోరంట్ల బాలురు విన్నర్సుగా, పాలసముద్రం పాఠశాల రన్నర్సుగా గెలుపొందారు. చెస్ పోటీల్లో గోరంట్ల బాలురు విన్నర్సుగా నిలిచారు. కోకోలో వానవోలు పాఠశాల ప్రథమ, బూదిలి పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచారు అలాగే అండర్ 14 చెస్‌లో గోరంట్ల బాలురు విన్నర్సుగాను, పులేరు పాఠశాల రన్నర్సుగాను గెలుపొందారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో పులేరు ప్రథమ, బూదిలి ద్వితీయ స్థానం పొందగా, కోకోలో వానవోలు ప్రథమ, బూదిలి ద్వితీయస్థానం సాధించారు. అలాగే అథ్లెటిక్ పోటీల్లో విజేతలను ఎంపిక చేసినట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా పీడీలు రామమోహన్, వెంకటరమణనాయక్, రామచంద్రనాయక్, కృష్ణరెడ్డి, మనోహర్, బాషా, రవీంద్రనాయక్, రజనీకుమార్ వ్యవహరించారు.



సూరప్ప కట్ట వద్ద వాల్మీకుల 36 అడుగుల విగ్రహం



బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ...

గంగ ఒడిలోకి గౌరీ పుత్రుడు

కుర్రకారు జోరు- ఉర్రూతలూగిన యువత

అలరించిన నృత్యాలు



నిమజ్జన సందడి..

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 13: ఏడు రోజులుగా పూజలందుకున్న బొజ్జ గణపయ్యను శుక్రవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా దాదాపు 200 గణపతుల ప్రతిమలను ట్రాక్టర్‌లలో ఊరేగించారు. పెద్ద పెద్ద విగ్రహాలతో పట్టణం కోలాహలంగా మారింది. డిజేల మోతలు, దప్పుల సవ్వల్లు, బ్యాండు బాజాలతో దద్దరిల్లింది. ఒక్కో వినాయకుడి వద్ద యువత యూనిఫారం ధరించి ప్రత్యేకత చాటుకున్నారు. పురుషులతో సమానంగా మహిళలు, బాలికలు నృత్యాలు చేశారు. భక్తులు భారీ గణనాథులను తిలకించేందుకు తండోప తండాలుగా వచ్చారు. పట్టణ వాసులే కాకుండా చుట్టుపక్కల పల్లెల వారు, దూర ప్రాంతలలోని బంధువులు, కర్నాటక వాసులు తరలి వచ్చారు.



డీజీ కాలనీలోని త్రిముఖ గణపతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం

ఏస్కేడీఆర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

గోరంట్ల, సెప్టెంబరు 13: పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండవ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికే కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మీ, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం, మాట్లాడుతూ ఇష్టపూర్వకంగా కష్టపడి చదివేవారే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు ఆజాద్, జునీద్‌బాషా, నందగోపాల్, అరవింద్, కవిత, హరీష్‌బాబు, రఘునాథ్ రెడ్డి, బాలమోహన్, లక్ష్మీదేవి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఛ్చే.. స్టాంపు..!

అందుబాటులోలేని నాన్ జుడీషియల్ స్టాంపులు

ఈ-స్టాంపింగ్ కోసం వెళ్తే కొర్రీలు

క్రయవిక్రయదారులకు తప్పని తిప్పలు



మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మడకశిరటౌన్, సెప్టెంబరు 13: నియోజకవర్గ వ్యాప్తంగా నాన్‌జుడీషియల్, ఈ స్టాంపుల కొరత వల్ల భూములు, ఆస్తుల క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.10 స్టాంపు కావాలన్నా 50 నుంచి 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు, నాలుగు నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా అటు అధికారులు, ఈస్టాంపింగ్ అప్పగించిన ప్రైవేటు సంస్థ స్టాక్‌హోల్డింగ్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. ఈస్టాంపింగ్ అడిగితే సంబంధిత ఏజెన్సీ అర్థంలేని నిబంధనలతో చుక్కలు చూపుతోందని స్టాంప్‌వెండర్లు వాపోతున్నారు. మడకశిర పట్టణంలో పదిమందికిపైగా లైసెన్స్‌డ్ హోల్డర్లు ఉన్నా.. ఒకరికి మాత్రమే స్టాక్ హోల్డింగ్ సంస్థ ఈస్టాంపింగ్‌ను అప్పగించింది. అప్పటి నుంచి ఇబ్బందులు తలెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వంలో నాన్ జుడీషియల్ స్టాంపుల స్థానంలో ఈస్టాంపింగ్ విధానాన్ని అమలు చేశారు. ఈస్టాంపింగ్ విధానంపై స్థిరాస్తుల క్రయవిక్రయదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అయినా వైసీపీ ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లింది. మడకశిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రోజూ 35 రిజిస్ట్రేషన్ల వరకు జరుగుతుంటాయి. స్టాంపులు లేకపోవడంతో హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నోటరీల కోసం రూ.10, రూ.20 స్టాంపులు లేకపోవడంతో విద్యార్థులు ఇతరత్రా అవసరాల కోసం వచ్చేవారు పడే ఇబ్బందులు అన్నీ, ఇన్నీకావు. స్టాంపు వెండర్ లైసెన్స్ ఉన్నా గత జగన్ ప్రభుత్వంలో స్టాక్‌హోల్డింగ్ సంస్థకు ఈస్టాంపింగ్ ఇచ్చే అధికారం ఇవ్వడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజముద్ర కావాలనీ, రకరకాల డాక్యుమెంట్లు సమర్పించాలనీ, లేనిపోని ఆంక్షలు పెడుతూ ఇబ్బందులు పెడుతున్నారు. ఆన్‌లైన్‌లో వారి వివరాలు ఉంటాయనీ, అయినా ప్రైవేటు సంస్థకు అప్పగించడం వల్ల వారు సొంత ఆంక్షలు పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో తమ పేర్లు ఉన్నాయనీ, తమ లైసెన్స్ ఒరిజినలేనని కర్నూలుకు వెళ్లి స్టాంప్ హోల్డింగ్ సంస్థ వద్ద ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా వారు మాత్రం కనికరించకపోవడంతో మడకశిరలో ఈస్టాంపింగ్ ఇవ్వకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజూ క్రయవిక్రయదారులతోపాటు డాక్యుమెంట్ రైటర్లు సైతం ఇతర ప్రాంతాల నుంచి స్టాంపులు తెప్పించుకుని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి సమస్యను పరిష్కంచాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

ఈ-స్టాంపింగ్‌లో ఇబ్బందులు



గత ప్రభుత్వంలో ఈస్టాంపింగ్ విధానం ప్రవేశ పెట్టినప్పట్నుంచి పది రూపాయల స్టాంపు కావాలన్నా.. చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆన్‌లైన్‌లో స్టాంపు తీసుకోవడానికి వెళితే సర్వర్ సమస్య అంటూ వెనక్కి పంపుతున్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పలుమార్లు సబ్‌రిజిస్ట్రార్‌కు సమస్యలు విన్నవించుకున్నాం. ప్రభుత్వ విధానమనీ, తాము ఏమీచేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు.

- మంజునాథ్, గౌడనహళ్లి

పాత విధానాన్నే కొనసాగించాలి



పది రూపాయల స్టాంపు కావాలన్నా వారం నుంచి తిరిగినా దొరికే పరిస్థితి లేదు. ఈస్టాంపింగ్‌లో సైతం స్టాంపు స్టాకు లేకపోవడం వల్ల మడకశిరకు మా గ్రామం నుంచి దాదాపు 40 కిలోమీటర్లు వెళ్లినా నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. రెండు, మూడు నెలలుగా పరిస్థితి ఇలానే ఉంది. నాన్ జుడీషియల్ స్టాంపులు అందుబాటులోకి తెచ్చి, సమస్యను వెంటనే పరిష్కరించాలి.

- రవి, జీవీఎన్ పాళ్యం

ప్రైవేటుకు అప్పగించడం వల్లే సమస్యలు

ఈస్టాంపింగ్ విధానాన్ని ప్రైవేటు సంస్థకు అప్పగించడం కారణంగా స్టాంపుల కొరత ఏర్పడుతోంది. మడకశిర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో నాన్‌జుడీషియల్ స్టాంపులు అవసరం అని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. రూ.10, రూ.20, రూ.50, రూ.100 విలువైనవి లక్ష చొప్పున స్టాంపులకు ఇండెంట్ పంపాం. ఆ స్టాంపులను వస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- హరీష్, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, మడకశిర

నేడు గోరంట్లలో విద్యుత్ కోత

గోరంట్ల, సెప్టెంబరు 13: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 5గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎఇ క్రిష్ణ శ్రీనివాస్ తెలిపారు. పుట్టపర్తి 33 కెవి విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడిందన్నారు. రైతులు, చేనేత వర్గాల వారు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

మద్యం షాపులు బంద్

హిందూపురం టౌన్, సెప్టెంబరు 13: వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని పురస్కరించుకుని శుక్రవారం మద్యం షాపులు బంద్ చేయించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మద్యం షాపులు బంద్ చేయించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

చట్టాలపై అవగాహన సదస్సు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 13: రొద్దం మండలంలోని చెరుకూరు గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు అనంత శక్తి సీఈఓ లావణ్య శుక్రవారం తెలిపారు. చట్టాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు చేయడం నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతశక్తి సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

గోరంట్ల, సెప్టెంబరు 13: మండలంలోని పులేరు గ్రామంలో ఉచిత గుండె వైద్యచికిత్స శిబిరాన్ని గుమ్మయ్యగారిపల్లి శ్రీమారెమ్మ ఆలయ సేవా ట్రస్టువారు శనివారం నిర్వహిస్తున్నారు. పులేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 2గంటలవరకు అనంతపురం కిమ్స్, సవేరా ఆసుపత్రి వైద్యులు చికిత్స చేస్తారన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆలయ సేవా సమితి కోరింది.

ద్విచక్రవాహనానికి నిప్పు



ఆహుతైన ద్విచక్రవాహనం

లేపాక్షి, సెప్టెంబరు 13: మండల పరిధి లోని బిసలమానేపల్లి గ్రామానికి చెందిన మధుసూధన్‌కు సంబంధించిన ద్విచక్రవాహనానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఇంటి ముందు బండి నిలిపి లోపల నిద్రిస్తుండగా వాహనానికి దుండగులు నిప్పుపెట్టినట్లు వాహనయజమాని తెలిపాడు. ఇంటి ముందు అలజడి విని బయటకు వచ్చి చూడగా ద్విచక్రవాహనం అగ్నికి తగులబడుతోందన్నారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపీ తెలిపారు. ద్విచక్రవాహనం విలువ రూ.2లక్షలని బాధితుడు తెలిపాడు.

వాటర్ క్యాన్ల వితరణ



విద్యార్థులకు వాటర్ క్యాన్లు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్

పెనుకొండ, సెప్టెంబరు 13: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ తరపున శుక్రవారం బ్యాంకు మేనేజర్ పవన్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి మంచినీటి క్యాన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు, మూర్తి, హఫీజ్, శివన్న, అల్లాబకష్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సీఐ



రామారావు

మడకశిర టౌన్, సెప్టెంబరు 13: మడకశిర నగర పంచాయతీ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ రామారావు అన్నారు. మడకశిర అర్బన్ సీఐగా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా అలిపిరిలో సీఐగా విధులు నిర్వహిస్తూ అక్కడి నుంచి సీఐగా మడకశిరకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి వారైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మడకశిర రూరల్, సెప్టెంబరు 13: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ లీలావతి తెలిపారు. మండలంలోని హరేసముద్రం పంచాయితీ ఉప్పర్లపల్లి గ్రామంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. మొదట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భవతులకు శ్రీమంతాలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారంతోపాటు ఆకుకూరలు తీసుకోవాలన్నారు. అదే విధంగా గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా టీ కాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

బాగా చదివితేనే బంగారు భవిష్యత్తు: సీఐ

మడకశిర రూరల్, సెప్టెంబరు 13: విద్యార్థులు బాగా చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలో శుక్రవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ శిక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని తెలిపారు. ర్యాగింగ్ లో పాల్గొని తమ భవిష్యత్‌ను కోల్పోవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. అనంతరం విద్యార్థులచే యాంటీ ర్యాగింగ్ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అసోషియేట్ డీన్ సరోజినీ దేవి ,విద్యార్థులు పాల్గొన్నారు.